క్లుప్తంగా

బిడ్డకు తల్లిపాలే ప్రధాన ఆహారం



ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ మాణిక్యరావు

కర్నూలు(హాస్పిటల్): బిడ్డకు తల్లిపాలే ప్రధాన ఆహారమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజి విభాగాధిపతి డాక్టర్ మాణిక్యరావు,చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానందబాబు చెప్పారు. ప్రపంచ తల్లి పాలు వారోత్సవాలను పురస్కరించుకుని గైనకాలజి, పీడియాట్రిక్స్ విభాగాల ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు మెడికల్ కాలేజి నుంచి రాజవిహార్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ పుట్టిన వెంటనే గంటలోపు శిశువుకు తల్లిపాలు తాగించాలన్నారు. దీంతో పాటు గంటలోపు తల్లికి వచ్చే ముర్రుపాలలో ఎన్నో పోషకాలతో పాటు వ్యాధినిరోధక శక్తి ఉంటుందన్నారు. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మినహా మరే ఇతర ఆహారం ఇవ్వకూడదని చెప్పారు. తల్లిపాలలో విటమిన్లు, మినరల్స్, పోషక విలువలతో కూడిన పదార్థాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ పీడియాట్రిక్స్ సెక్రటరి డాక్టర్ రత్నాకర్‌రెడ్డి, పీడియాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా



సెక్యూరిటీ కుటుంబ సభ్యులకు చెక్ ఇస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో సెక్యూరిటీ సిబ్బందిగా పని చేస్తూ అనారోగ్య కారణాలతో మరణించిన వారి కుటుంబాలకు మంజూరైన పరిహారాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. సోమవారం మార్కెట్ యార్డులోని కమిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వెంకటరమణ, రామిరెడ్డి కుటుంబ సభ్యులకు రూ.2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను చైర్మన్ అందచేశారు. కార్యక్రమంలో సెక్రటరీ గోవిందు, వైస్ చైర్మన్ బీమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రేపు కార్మిక సంఘాల మహా పడావో



కలెక్టరేట్ ఎదుట మానవ హారం చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో విజయవాడలో ఆగస్టు 9వ తేదీన చేపట్టే కార్మిక సంఘాల మహా పడావో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ వద్ద మహా పడావో విజయవంతం కోసం కార్మికసంఘాలతో భారీ మానవ హారం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని ప్రధాని మోదీ అదానీ, అంబానీలకు కట్టబెట్టి పాలన చేస్తుండడంతో కార్మికులు, కర్షకులు, మధ్య తరగతి ప్ర జలు కష్టాలు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్ మాణిక్యం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



లక్ష్మన్న

కర్నూలు సిటీ: సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో గణితం అధ్యాపకుడిగా పని చేస్తున్న బి.లక్ష్మన్నకు రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కాలేజీ ఆచార్యులు ఎస్.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో గణిత విభాగంలో 'సమ్ ఎంహెచ్‌డీ కన్‌వెక్టివ్ ఫ్లోస్ పోరస్ మీడియం' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ నేపథ్యంలో కాలేజీ కరస్పాండెంట్ వై.శౌరీలు రెడ్డి, ప్రిన్సిపాల్ కె శాంత, వైస్ ప్రిన్సిపాల్ సీవీ సత్యనారాయణ, అధ్యాపకులు లక్ష్మన్నను అభినందించారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే



ఇంటింటి సర్వేలో వివరాలు పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు (టౌన్) : ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. సోమవారం నగరంలో బూతు స్థాయి అధికారులతో కలిసి సర్వేను కమిషనర్ పరిశీలించారు. స్థానిక నరసింగరావు పేటలో బీఎల్‌ఓలతో పాటు ఇంటి యజమానులతో కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో బీఎల్‌ఓలు మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. నిర్దేశించిన వివరాలతో సర్వే పక్కాగా చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రగతి పరుగులు!

- నగరంలోనే ఆదర్శంగా 17 వ వార్డు
- రెండేళ్లలో రూ. 4 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.1.50 కోట్లతో మున్సిపల్ కార్టూన్ థీమ్ పార్కు ఏర్పాటు
- రూ.70 లక్షలతో సాగుతున్న సెంట్రల్ మీడియన్ పనులు
- గడప గడప నిధులతో కాలనీల్లో మౌలిక సదుపాయల కల్పన
- తోపుడు బండ్ల వ్యాపారులకు రూ.30 లక్షలతో షెడ్ల ఏర్పాటు



80 లక్షలతో జొహరాపురం రోడ్డు మీదుగా నిర్మించిన సెంట్రల్ మీడియన్ పనులు



రూ.1.64 కోట్లతో నిర్మిస్తున్న మున్సిపల్ కార్టూన్ థీమ్ పార్కు



రూ. 35 లక్షలతో మాంటిస్సోరి వెనుక వైపు అప్రోచ్ రోడ్డు పనులు

కర్నూలు (టౌన్): నాలుగేళ్ల క్రితం వరకు నగరంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండేది. వార్డుల్లో కనీస సదుపాయాలు ఉండేవి కాదు. ప్రజలు సమస్యలతో సావాసం చేసేవారు. వైఎస్‌ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నగరపాలకకు ఎన్నికలు నిర్వహించింది. దీంతో కొత్త పాలక వర్గం ఏర్పడింది. స్థానికంగా కార్పొరేటర్లు రావడంతో ప్రజా సమస్యల పరిష్కారానికి అవకాశం లభించింది. వారు ఎప్పటికప్పుడు కాలనీల్లో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇందుకు నగర పరిధిలోని 17 వ వార్డును ఓ ఉదాహరణగా చెప్పవచ్చు. కలెక్టరేట్ వెనుకే ఉన్న ఈ వార్డులో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

రెండేళ్లలో రూ.4కోట్లతో అభివృద్ధి పనులు

నగరపాలక వర్గం వచ్చిన రెండేళ్లలోనే 17 వ వార్డు అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోంది. ఇప్పటి వరకు కాలనీ ప్రజల సమస్యలతో పాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్ నుంచి జొహరాపురం మీదుగా నిత్యం ట్రాఫిక్ ఉంటుంది. ఈ మార్గంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. సమస్య పరిష్కారానికి ఇక్కడ రూ.80 లక్షలతో రహదారికి ఇరువైపుల సెంట్రల్ మీడియన్ వంటి అభివృద్ధి పనులు చేపట్టారు. మాంటిస్సోరి పాఠశాల వెనుక వైపు నుంచి నేరుగా జొహరాపురం ఎస్వీ గ్రీనరీ అపార్టుమెంట్ వరకు రూ. 35 లక్షలతో అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. గణేష్‌నగర్‌లో సైన్సు పార్కు, వెంకటరమణ కాలనీలో మ్యూజిక్ పార్కు తరహాలో ఇక్కడ కూడా రూ. 1.64 కోట్లతో కార్టూన్ థీమ్ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా పిల్లలను ఆకర్షించేలా పార్కు ను సుందరీకరిస్తున్నారు.

'గడప గడప' నిధులు కేటాయింపు

నగరపాలక పాలక నిధులతో పాటు గడపగడప కార్యక్రమం నిధులతో కూడా 17 వ వార్డులో వివిధ పనులు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ స్థానిక కార్పొరేటర్‌తో కలిసి చాణిక్యపురి కాలనీ, జొహరాపురం రోడ్డు ఎల్‌బీజీ నగర్‌లలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి రూ. 60 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో డ్రెయినేజీ, కల్వర్టు నిర్మాణాలు, దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులు చేపట్టారు.

రూ.30 లక్షలతో హాకర్ జోన్

వినాయక్‌ఘాట్ నుంచి కేసీ కెనాల్ మీదుగా ఇరువైపులా తోపుడు బండ్లు పెట్టుకొని పలువురు వ్యాపారాలు చేసుకుంటున్నారు. వారి కోసం రూ. 30 లక్షలతో హాకర్ జోన్ ఏర్పాటు చేస్తున్నారు. షెడ్డు తరహాలో జరుగుతున్న ఈ పనులు త్వరలోనే పూర్తి కానున్నాయి.

ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతున్నాం



నగరంలోనే 17 వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం. ఇప్పటికే రూ. 4 కోట్లు ఖర్చు చేశాం. 16 అభివృద్ధి పనులు చేపట్టాం. గడప గడప కార్యక్రమంలో కాలనీల ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇచ్చాం. కాలనీ వాసులకు ఆహ్లాదం పంచేందుకు దాదాపు రూ. 1.64 కోట్లతో కార్టూన్ థీమ్ పార్కును నిర్మిస్తున్నాం. అలాగే ప్రధాన రోడ్లను విస్తరించాం. జొహరాపురం మార్గంలో ప్రమాదాలు జరగకుండా ప్రధాన రహదారిలో సెంట్రల్ మీడియన్ పనులు చేపట్టాం.

– కైపా పద్మాలతా రెడ్డి, 17 వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు

ఎన్నికల పర్యవేక్షకులుగా 11 మంది నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన ఎలక్ట్రోల్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): 137 వ కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల పర్యవేక్షకులుగా 11 మందిని నియమించారు. ఈమేరకు సోమవారం కర్నూలు అసెంబ్లీ ఎలక్ట్రోల్ అధికారి భార్గవ్‌తేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఖలీల్–ఉర్–రెహమాన్, జి. సోహెయిల్ అహమ్మద్, ఎస్. మన్సూర్ బాషా (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్), మహమ్మద్ జునీద్ (రెవెన్యూ ఆఫీసర్), ఎస్. రాజు, ఎస్. ఇస్మాయిల్, ఎం. అబ్దుల్ రసూల్, టి. అబ్దుల్ వాజిద్, పి.సాధిక్ హుస్సేన్, పి. క్రిష్టఫర్ బాబు, ఎస్. మన్సూర్ బాషా (సూపరింటెండెంట్)ను నియమించారు. ఇప్పటికే సచివాలయాల ఉద్యోగులు బూత్ లెవల్ ఆఫీసర్లుగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. ఇంటింటి సర్వే చేస్తున్నారు. పక్కా ఓటర్ల గుర్తింపు చేస్తున్నారు. పొరపాట్లు సరిదిద్దుతున్నారు. వీరి పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు ఎన్నికల పర్యవేక్షకులను నియమించినట్లు నగరపాలక అధికారులు వెల్లడించారు.

సంక్షిప్తం

కళాకారుడికి ఆర్థికసాయం

కర్నూలు (న్యూసిటీ): అనారోగ్యంతో బాధపడుతున్న కళాకారుడు అక్బర్ బాషాకు కళాకారుల సంక్షేమ సంఘం నాయకులు రూ.3 వేలు అందజేశారు. చికిత్స నిమిత్తం ఈ ఆర్థిక సాయం చేసినట్లు సోమవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రప్పశాల అంకయ్య, కోశాధికారి పి.గోవిందరాజు, పెన్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి. నీలోఫర్ హాస్పిటల్ ఎస్‌జీఎం సుభాన్ తెలిపారు. పేద కళాకారులను ఆదుకోవడంలో తమ సంఘం ముందుంటుందని చెప్పారు.

టీటీడీ పాలకమండలిలో గిరిజనులకు అవకాశమివ్వాలి

కర్నూలు(అర్బన్): తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిలో గిరిజనులకు అవకాశం కల్పించాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం పదవులను బడుగు, బలహీనవర్గాలకు ఇస్తుండటం హర్షించదగ్గ పరిణామమన్నారు. ఈ నేపథ్యంలోనే గిరిజన వర్గాలకు టీటీడీ పాలకమండలిలో అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు, కార్యదర్శి పి.వెంకటేష్, నాయకులు గౌతమ్ నాయక్, విజయ్‌కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసేవకుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): గ్రామ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ధర్నా చౌక్‌లో గ్రామ సేవకులు తమ డిమాండ్ల సాధన కోసం నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామ సేవకులకు పే స్కేలు అమలు చేయాలన్నారు. తెలంగాణలో మాదిరిగా గవర్నమెంట్ ఉద్యోలుగా గుర్తించాలన్నారు. అర్హత ఉన్న వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలసంఘం జిల్లా అధ్యక్షుడు అంజి, నాయకులు ఈరన్న, శ్రీనివాసులు, మల్లయ్య, ప్రహ్లాద పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): సంక్షేమ హాస్టళ్లలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే జునైద్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. హాస్టళ్లలో కనీస అవసరాలైన మంచినీరు, బాత్‌రూంలు, ఫ్యాన్లు, లైట్లు లేవన్నారు. పాడుబడ్డ భవనాల్లో విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలను పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎండీ రఫీక్, కె.నాగరాజు పాల్గొన్నారు.

బీరప్ప దేవాలయ నిర్మాణానికి విరాళం

కర్నూలు(అగ్రికల్చర్):పెద్దపాడు గ్రామంలో బీరప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి గూడూరు మండలం పెంచికలపాడు గ్రామానికి చెందిన కురువ కులస్తులు విరాళం ఇచ్చారు. గ్రామ కులస్తులు రూ. 65వేలు, గాదె కృష్ణ రూ.25 వేలు, మలేరియా సుంకయ్య రూ.10 వేల ప్రకారం ఇచ్చారని జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి రంగస్వామి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కురువ సంఘం నేతలు తిరుపాల్,ఎల్లయ్య, తవుడు శ్రీనివాసులు, గూడూరు మండలం కురువ సంఘం నాయకుడు కృష్ణ, పెంచికలపాడు నాయకులు మద్దిలేటి, నగేష్, చిన్న గిడ్డయ్య, యుగంధర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ భగవానుడే నిజమైన స్నేహితుడు

కర్నూలు (న్యూసిటీ): ప్రజల హితం కోరి భగవద్గీత అందించిన శ్రీకృష్ణ భగవానుడే మనకు నిజమైన స్నేహితుడు అని త్రైత సిద్ధాంతం హిందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి కర్నూలు కమిటీ అధ్యక్షుడు నాగయ్య వెల్లడించారు. సోమవారం స్థానిక ఎఫ్‌సీఐ కాలనీలో భగవద్గీత గ్రంధాలను ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితిసభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వైద్య విద్య అందించాలి


కర్నూలు(సెంట్రల్): పేద విద్యార్థులకు వైద్య విద్య అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని గోకారి భవన్‌లో నిర్వహించిన పీడీఎస్‌యూ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 107, 108 ద్వారా ప్రైవేట్ మెడికల్ కాలేజీల యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా మారుస్తాయన్నారు. మెడికల్ సీట్లను కోట్లలో అమ్ముకొని సొమ్ము చేసుకునే అవకాశాలు ఉన్నాయన్నారు.

స్పందన వినతుల పరిష్కారానికి చర్యలు

కర్నూలు (టౌన్): స్పందన వినతుల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. నగర ప్రజల నుంచి వచ్చిన అర్జీలను కమిషనర్ స్వీకరించారు. మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రంగస్వామి, మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు ఉద్యమాలు

- ఘనంగా బీపీ మండల్ డే



బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ నేతలు

కర్నూలు(అర్బన్): చట్ట సభల్లో బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు సాధించేందుకు ఐకమత్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీసీ సంఘాల నేతలు అన్నారు. సోమవారం బీపీ మండల్ డే సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లో బీసీ సంఘాల నాయకులు బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఉద్యమాల ప్రజా గాయకుడు గద్దర్‌కు కూడా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎం.రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ వర్గాలకు 27 శాతం రిజర్వేషన్లు సాధించిన మహోన్నత వ్యక్తి బీపీ మండల్ అని కొనియాడారు. రిజర్వేషన్లు సాధించిన ఆగస్టు 7వ తేదీని బీపీ మండల్ డేగా నిర్వహించుకోవడం జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుర్రా ఈశ్వరయ్య, శకుంతల, భారతి, మోహన్, కృష్ణోజీ రావు, అయ్యన్న యాదవ్, శ్రీరామ్ యాదవ్, రఘు యాదవ్, కంది వరుణ్‌కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున యాదవ్, కనికె శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనస్సులో టీకాలు ఇప్పించాలి



చిన్నారులకు టీకాలు ఇప్పిస్తున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): రెగ్యులర్‌గా ఇవ్వాల్సిన టీకాలు ఎటువంటి సందర్భంలోనైనా ఇవ్వలేకపోతే అలాంటి పిల్లలకు ఈ నెల 12వ తేదీ వరకు నిర్వహించే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో టీకాలు ఇప్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం ఆయన స్థానిక ముజఫర్ నగర్ పరిధిలోని రాజీవ్‌గృహ కల్ప, శ్రీనివాసనగర్ సెక్రటేరియట్స్, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో జరిగే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని మళ్లీ సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు, అక్టోబర్ 9 నుంచి 14వరకు నిర్వహిస్తారన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణిలకు టీకాలు వేయించి ఆ వివరాలను యూ విన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ హెచ్‌ఓడి డాక్టర్ విజయానందబాబు, డబ్ల్యూహెచ్‌వో ఎస్ఎంవో డాక్టర్ భవాని, వైద్యాధికారులు నందిని, సుప్రియ, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ టీకాలు ఇప్పించాలి

గర్భిణిలు, చిన్నపిలలకు సమయానుసారంగా ఇవ్వాల్సిన టీకాలు ఏదైనా కారణం చేత ఇవ్వనట్లయితే ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు సర్వే చేసి వారికి మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో టీకాలు ఇప్పించాలని జిల్లా మాస్ మీడియా అధికారిణి ప్రమీలాదేవి చెప్పారు. స్థానిక ముజఫర్‌నగర్‌లోని సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆమె సోమవారం తనిఖీ చేశారు. గృహ సందర్శనాలు చేసి ఎంసీపీ కార్డు పరిశీలించి పిల్లలకు ఇప్పించాల్సిన టీకాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సుప్రియ, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన జొహరాపురం గ్రామానికి చెందిన ఖాదర్ బాషా (55) కోలుకోలేక ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈయన గౌండ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ నెల 4వ తేదీ ద్విచక్ర వాహనంపై జొహరాపురం వెళ్తూ మార్గమధ్యంలో అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించగా కోలుకోలేక మృతిచెందాడు. ఈయనకు ఇద్దరు కుమారులు సంతానం. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విన్నపం

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్) : ఆశావర్కర్లకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.నరసరావు, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావును ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రి ఇచ్చారు. ఆశా వర్కర్లను వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రిటైర్‌మెంట్ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలన్నారు.

ఫార్మసీ రంగాన్ని పటిష్టపర్చండి

- పార్లమెంట్‌లో ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ సంజీవ్‌కుమార్

కర్నూలు(రాజ్‌విహార్) : వైద్యారోగ్య శాఖలో కీలకంగా ఉన్న ఫార్మసీ రంగాన్ని పటిష్టపరచాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ కోరారు. సోమవారం ఆయన పార్లమెంట్‌లో ఫార్మసీ సవరణ బిల్లు–2023పై మాట్లాడారు. నాణ్యమైన మందుల సరఫరాతోనే ప్రజలకు వైద్యఖర్చుల భారం తగ్గుతుందని, దీంతో పాటు అనారోగ్యం నుంచి త్వరగా కోలుకునే అవకాశముంటుందని వెల్లడించారు. నకిలీ మందులను అరికట్టి నాణ్యమైన వాటి ఉత్పత్తి, సరఫరాపై దృష్టి పెట్టాలని చెప్పారు.

ఐఈఆర్‌టీలకు ఎస్‌జీటీ హోదా కల్పించాలి

కర్నూలు సిటీ: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో ఐఈఆర్‌టీలుగా పని చేస్తున్న వారికి ఎస్‌జీటీ హోదా కల్పించాలని కోరుతూ ఏపీ భవిత స్పెషల్ ఎడ్యుకేటర్ ఫెడరేషన్ నాయకులు సోమవారం వైఎస్ఆర్‌సీపీ కర్నూలు పార్లమెంటు అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు చాలా ఏళ్లుగా చదువులు చెబుతున్నామన్నారు. 2021 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎం.ఎస్ నెంబరు 40, 2022లో జారీ చేసిన జీఓ 5ను తమకు వర్తింపజేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏపీ భవిత స్పెషల్ ఎడ్యుకేటర్ ఫెడరేషన్ నాయకులు నీలకంఠేశ్వరరావు, పుష్పాంజలి, బేబి సునీత, సెమిముల్లాఖాన్, తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం

కర్నూలు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం సూచించారు. మండల పరిధిలోని చిన్నటేకూరు సమీపంలో ఉన్న బృందావన్ ఇంజినీరింగ్ కాలేజ్‌లో సోమవారం ట్రాఫిక్ నియమాలపై విద్యార్థినులకు ప్రాజెక్టర్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ హాజరై మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా విద్యార్థినీ విద్యార్థులు వాహనాలపై కాలేజికి వస్తే ఎటువంటి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దని కళాశాల నిర్వాహకులకు సూచించారు. పొరపాటున ప్రమాదం జరిగితే విద్యార్థులు పోలీసు కేసుల్లో ఇరుక్కుని ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోల్పోతారని హెచ్చరించారు. స్నేక్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ వంటివి ప్రమాదకరమన్నారు. వాహనాలను అతి వేగంగా నడపరాదన్నారు. ఇన్సూరెన్స్ లేని వాహనాలు కూడా నడపరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని లైసెన్స్ లేని పిల్లలకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ డీఎస్పీతో పాటు కాలేజ్ బోధన, బోధనేతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

హాస్య కళావల్లభుడు.. సంగా





టీజీవీ కళాక్షేత్రంలో సంగా ఆంజనేయులును సత్కరిస్తున్న దృశ్యం (ఫైల్), వేషధారణలో సంగా

- వృత్తి ప్రభుత్వ ఉద్యోగి.. ప్రవృత్తి కళాసేవ
- మూడు దశాబ్దాలుగా పౌరాణిక, సాంఘిక నాటకాల్లో రాణింపు
- మూడుసార్లు జాతీయ ఉత్తమ హాస్య నటుడు పురస్కారాలు కైవసం
- తనదైన శైలి నటనతో మెప్పిస్తున్న సంగా ఆంజనేయులు

కర్నూలు కల్చరల్: ఆయన ఒక పక్క ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ మరో పక్క తనకు ఉన్న కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. మూడు దశాబ్దాల క్రితం మొదలైన ఈ ప్రస్థానం ఆయనను జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడు పురస్కారాలు అందుకునే స్థాయికి చేర్చింది. పౌరాణిక, సాంఘిక నాటకాలు, లఘు నాటికలు, లఘు చిత్రాల్లో తనదైన శైలి నటనతో హాస్య కళావల్లభుడుగా ఎదిగారు సంగా ఆంజనేయులు.

కుటుంబ నేపథ్యం..

అనంతపురం జిల్లా సత్యసాయి మండలం అగ్రహారం గ్రామానికి చెందిన సంగా మంగమ్మ, సంగా వెంకటప్పల కుమారుడు సంగా ఆంజనేయులు. సొంత జిల్లా అనంతపురం అయినప్పటికి ఉద్యోగ రీత్యా ఇతను కర్నూలు నగరంలో స్థిరపడ్డారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ప్రవృత్తిగా నాటక రంగాన్ని ఎంచుకున్నారు. టీజీవి కళాక్షేత్రంలో చేరి ఎన్నో పదవులు చేపట్టి కళా సేవ చేస్తున్నారు. గురువులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, మిత్రుడు ఎన్‌డీ క్రిష్టఫర్ సహకారంతో పులిస్వారీ నాటకంలోకి అడుగుపెట్టి 150కి పైగా నాటకాలు వేశారు. టీజీవీ కళాక్షేత్రంలో దాదాపు 25 సంవత్సరాల నుంచి వందలాది నాటకాలు వేసి అనేక రాష్ట్రాల నుంచి పలు బహుమతులు పొందారు.

పేరు తెచ్చిన నాటకాలు

ప్రియంవద, బావ ఎప్పుడు వచ్చితివి, పుటుక్కు జరజర డుబుక్కుమే, పూజకు వేళాయరా, క్రెడిట్ కార్డ్ వంటి సాంఘిక నాటకాల ద్వారా మంచి పేరుపొందారు.శ్రీకృష్ణ అభిమన్యు, నర నారాయణ, ప్రమీల అర్జున పరిణయం, బభ్రు వాహన విజయం, శ్రీకృష్ణ కమలపాలిక, శ్రీకృష్ణ కర్ణార్జునీయం వంటి పౌరాణిక నాటకాల్లో నటించి పలు అవార్డులు కైవసం చేసుకున్నారు.పలు షార్ట్ ఫిలిమ్స్‌లో నటించి మెప్పించారు.

వరించిన పురస్కారాలు..

- పౌరాణిక నాటకాల్లో సంగా ఆంజనేయులు ఉత్తమ హాస్యనటుడిగా మూడుసార్లు జాతీయ స్థాయి అవార్డులు, మూడు గరుడ అవార్డులు అందుకున్నారు.
- 2013లో బభ్రువాహన విజయం నాటకంలో ప్రదర్శించిన ప్రతిభకు జాతీయ స్థాయి ఉత్తమ హాస్య నటుడి పురస్కారం దక్కింది.
- 2016లో ప్రమీలార్జున పరిణయం నాటకానికి జాతీయ స్థాయి ఉత్తమ హాస్య నటుడి పురస్కారం
- 2019లో శ్రీకృష్ణ కమలపాలికలో ఉత్తమ హాస్యనటుడిగా బహుమతి
- 2022లో కళల కాణాచి తెనాలిలో ప్రదర్శించిన శ్రీకృష్ణ కమలపాలిక పౌరాణిక నాటకంలో జాతీయ స్థాయి ఉత్తమ హాస్య నటుడిగా వీణ అవార్డు
- 2022లో కందుకూరి అవార్డు
- జగద్గురు షిరిడీ సాయిబాబా సినిమాలో అబ్దుల్లా క్యారెక్టర్ వేసి ప్రేక్షకులను మెప్పించారు.

నటనపై మక్కువ

నాకు నటన అంటే ఇష్టం. దీంతో నేను ఉద్యోగం చేస్తూనే కళారంగంలో రాణించగలిగాను. గత జూన్ 30న జిల్లా నీటి యాజమాన్య సంస్థలో సీనియర్ అసిస్టెంట్‌గా పదవీ విరమణ పొందాను. ఇప్పుడు పూర్తి స్థాయిలో కళా రంగ సేవలో పాలుపంచుకోవడంతో పాటు నాటకాలకు ప్రాధాన్యత ఇవ్వాలనుకున్నాను. కళా రంగం పరంగా నన్ను ప్రోత్సహించి నా ఎదుగుదలకు తోడ్పడిన కుటుంబ సభ్యులు, అధికారులు, టీజీవి కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యను ఎప్పటికీ మరిచిపోలేను.

– సంగా ఆంజనేయులు, సీనియర్ కళాకారుడు